తున్నాను. వినోద్ ప్రతిరోజూ ఉత్తరాలువ్రాస్తే వాడు తాను కలుసుకుంటానని కాని నేను నిరాకరించేదాన్ని. ఎందుచేతనంటే వినోద్ నన్ను కలుసుకొన్న క్షణంలోనే మళ్ళీ నా కుమారుడొస్తాడనే భయంతో. నా హారీన్!...ఇంకా బ్రతికున్నాడో, లేదో!...ఎక్కడ దాగుని వున్నాడో!...చాలా దూరంలో ఆ నీలిసముద్రం ఆవలివైపున పేరులేని దేశంలో ఉన్నాడేమో!...నా గురించి ఎప్పుడైనా ఆలోచిస్తాడా!...ఆ చిన్ని హృదయంలో అంత కఠినత్వమెక్కడిదో? హృదయంలోని బాధ, ఆవేదనలతో నేనెంత రోదించానో, నిరాశ, నిస్పృహలతో ఎంత అగాధంలో మునిగిపోయానో నా బిడ్డఆలోచించాడా? వాడికోసం ఈ రోజు దాకా జీవిస్తున్న నన్ను, నవమాసాలు మోసి కనిపెంచిన తల్లిని, హృదయంలోని ప్రేమ సంతటితోను పెంచిన తల్లిని ఎట్లా మరిచిపోతాడో! ఆమె మాతృహృదయం ఎంత తల్లడిల్లిపోతుందో ఆలోచించాడా? ఇంతకంటే క్రూర హింస మరొకటుంటుందా అజయబాబూ!...నేను చెప్పినదంతా వాడికి చెప్పండి. ఇంకా ఇలా చెప్పండి. "నా ప్రియమైన హారీన్, నీ తల్లిని ఇంకా అంత కఠినత్వంతో చూడకు. ఆమె జీవితామంతా బాధ, ఆవేదనలతో గడిచిపోయింది. నీవు విడిచి వెళ్ళిపోయినప్పటినుండి ఆమె జీవితం ఎలాక్షీణించిపోయిందో ఆలోంచించు. ఆమె భగ్నహృదయం ఎలా పరితపించి పోయిందో ఆలోచించు. ఆమెను అప్పటికైనా క్షమించు. ప్రేమతో ఆమెను ప్రార్థించు ఆమె పొందిన బాధా, పశ్చాత్తాపం మరియేతల్లికూడా అనుభవించలేదని గ్రహించు."

ఆమె మరికొన్ని నిముషాలు ఆగి అన్నది. "అజయబాబూ,ఇదికూడా నాకుమారునికిచెప్పండి "నేను ఆ రోజునుంచి వినోద్ ని మళ్ళీచూడలేదు."" ఆమెకన్నీరుఆగిపోయింది; క్షీణస్వరంతో గొణిగింది.

"మిమ్మల్ని వెళ్ళిపొమ్మని ప్రార్థిస్తున్నాను. జీవితంలో నేనుప్రేమించిన వారిద్దరూ నామరణశయ్య దగ్గరలేరు. కాబట్టి నేను ఒంటరిగానే మరణిస్తాను."

అజయబాబు బయటకు వచ్చేనాడు. మోటారు డ్రైవర్ని పిలిచినప్పుడు అతని గొంతుకు గద్గదమయింది. తర్వాత కొన్ని సంవత్సరాలకు నాకీజాలి గాథ వినుపిస్తూ అన్నాడు:

"ఇప్పటికీ కూడా ఆమె కొడుకురాలేదు. వాని హృదయం ఎటువంటిదో ఆలోచించలేకుండా వున్నాను. తల్లి వ్యామోహపు పనిచేసినప్పటికీ, హారీన్ బాబే, తల్లి హృదయాన్ని ప్రక్కలుచేసిన పాతకుడు, నేరస్థుడూ."

(ఆధారం: ఒక ఫ్రెంచికథ)

---

సెక్చ్

# ఛాన్సు వస్తే సరేసరి!

గన్నిశెట్టి వెంకటేశ్వరరావు

"మనిషికొక్క పిచ్చి మహిలో వేమా!" అన్నట్లు మా సుబ్బాయిగాడికీమధ్య, సినిమాల్లో నటించాలన్న పిచ్చిపట్టింది. అది క్రమేణా వృద్ధిజెంది, మేహాపుండులా మానకుండా, వాడినేగాక, మా మిత్రబృందాన్నంతటినీ, బాధించ సాగింది. ఏనాటికయినా సినిమా లోకంలో తను తారాపథాన్నందుకొనక తప్పదని, మావాడి గట్టినమ్మకం అలా నమ్మి తీరవలసిందిగా, మా మిత్రబృందాన్నంతటిని, నిస్సంకోచంగా శాసిస్తాడు. వాడితో వాదించవలసిన ఖర్మ యెలావున్నా, వాడినుండి మాకుముట్టే; కాఫీలు, సిగరెట్టులూ లభ్యంకాకుండా పోతాయన్న భయంతో, నమ్మినట్లు నటించక తప్పదు మరి! ఇహ వాడికి గేస్‌కొట్టి, వాడిపిచ్చిని మరింత వృద్ధిజేసి వాడి మన్ననలకు పాత్రులయ్యే మా చలపాయిగాడి రకం వుండనే వుంటుందనుకోండి.

ఈమధ్య మావాడి ధోరణి మరీ విపరీతమయింది. వేష భాషలన్నీ అచ్చంగా సినిమావాళ్ళ ఫక్కీలోనికి మార్చటమేగాక, ఏనటుడికే అలవాట్లున్నాయో, ఏతార యేసబ్బు వాడుతుందో, ఏ

సినిమాజీవి యెటువంటి పుస్తకాలు చదువుతాడో, వాళ్ళకెటువంటి ఆటలంటే యిష్టమో, వాళ్ళేరకం కుక్కల్ని పెంచుతారో వగైరా విషయాలన్నీ, సినిమా పత్రికలద్వారా తెలుసుకొని, వాటిని తు. చ. తప్పకుండా ఆచరించటం మొదలెట్టాడు. ప్రతిదినం సినిమా హాలులోని కుర్చీలో వీడిదర్శనం తప్పకుండా దొరికి తీరుతుందంటే అతిశయోక్తి గాదు. వాడి పుణ్యమా అని, వద్దన్నా మామిత్ర బృందమంతటికి తరచు అట్టి అదృష్టం కలుగుతూనే వుంటుంది. (చేతిచమురు దండుగ లేదుగా మరి!) వాడు సినిమాలో చూచిన హీరోకి ఎన్ని క్రాఫ్‌జుట్టులున్నాయో అన్ని పోజులతో వీడి ఫోటోలు మరునాటికి తయారు కావలసిందే! సినిమా పత్రికల్లో వ్యాసాలు రాయటం, కారుల్లో, పార్కుల్లో, ఒకచోటేమిటి, వాడెక్కడ నోరువిప్పితే, అక్కడల్లా, సినిమాలను గురించి చర్చలే! వాడు ఉత్తర ప్రత్యుత్తరాలు నడపని, వాడిపోజులు పంపని, సినిమా సంస్థ మెడ్రాసులో లేదనే చెప్పాలి. హిందీ రాదుగాని వస్తే ఉత్తరహిందూ స్థానాలు కూడా ఎగబడేవాడేమో! ఎన్ని తంటాలుపడ్డా పాపం! మావాడి సినిమా ఛాన్సు అనేది, అందకుండా గగనకుసుమమయి కూర్చొంది. అయినా పట్టుదలమాత్రం వాడు వదలలేదు.

ఈ విషయంలో మొదట అందరం "అది అందని ద్రాక్షపండురా" అని మందలించినప్పటికి, దీనివలన యెవరికీ యెటువంటి లాభం చేకూరక పోగా, మాకుమాత్రం కొంచెము నష్టమవుపించేసరికి, (కాఫీ డబ్బుల రూపేణా) ఆ ప్రయత్నంనుండి విరమించుకొన్నాం. ఇహ యితరులు వాడినొక పిచ్చివాడిక్రింద గట్టి వినోదించటం మొదలెట్టారు.

వాడి ధోరణికి విసిగిపోయి ఒకనాడు "ఇక్కడ వుండి ఈ తిప్పలన్నీ పడేకన్నా వకసారి మెడ్రాసు వెళ్ళి ముఖాముఖీ తేల్చుకొంటె మంచిదేమోరా!" అన్నాను. అందుకే నిరీక్షిస్తున్నారా బ్రదర్! మా నాన్నసంగతి నీకు తెలుసుగా! ఆయన బ్రతికుండగా ఛస్తే దమ్మిడీ మనకివ్వడు. మనం వెళ్ళేమంటే మళ్ళ తిరిగి ఖాళీగా రాకూడదు. అక్కడ మకాంవేసి అటో ఇటో తేల్చుకోవాలి. అందుకే మానాన్న ఏదో నాదని నాకివతల పారేస్తే 'మరుక్షణమె మదరాసుకు చెక్కేస్తాను' అన్నాడు.

ఒకనాడు మామిత్రబృందమంతా సమావేశమై, గ్రామ పరిస్థితులను గురించి చర్చించాము. మా గ్రామం అన్నివిధాలా వెనుకబడివుంది. గ్రామం రోడ్లు వేయించటం మాట యెలావున్నా, "ఏదో నలుగురు కుర్రాళ్ళూ చదువుకొంటారు కదా" అని ఓ లైబ్రరీఅన్నా స్థాపించలేదు మా పంచాయితీవారు. "పంచాయితీ బోర్డువారి ఈ నిర్లక్ష్యానికి. తీవ్రమయిన నిరసన తెలుపవలసిందిగా" తీర్మానాన్ని ప్రవేశపెట్టాడు చలపాయిగాడు. అందరం ఏకగ్రీవంగా ఆమోదించాం తీర్మానాన్ని. వెంటనే గ్రామంలో లైబ్రరీ నిర్మించవలసింగా పంచాయితీ బోర్డును కోరుతున్నాం అని సూరి తీర్మానం. "వాళ్ళను దేబరించటం మనకు తీరని అవమానం. వాళ్ళ మొహంమీద కొట్టినట్లు, మనమే సొంతంగా లైబ్రరీ స్థాపించుకోవాలి" అన్నాడు శర్మ. "ఆల్ రైట్" అన్నాం అందరం. "మరి మనకు తైలం కరువుగా" అన్నాడు రాజాయి. ఊళ్ళో చందాలు ప్రోగుజేసి లైబ్రరీ నిర్మిద్దాం." అన్నాడు శర్మ. "మనం బయలుదేరితే చందాలిచ్చే గాడిదెవడురా మన మొహాలకి?" అన్నాడు సూరి. అదీ ఆలోచించవలసిన విషయమే. తగినంత చెడుపేరు నార్జించుకొని వుంటిమి దగుల్బాజీలుగా గ్రామంలో. కాస్సేపు యెవరికి తోచిన సలహాలు వాళ్ళమిచ్చాం. అవన్నీ సభ్యుల అనాదరణకు గురై త్రోసివేయబడ్డాయి.

ఉన్నట్టుండి మా రాజాయిగాడి బుర్రకి మాంచి ఐడియా తట్టింది. "అరె బ్రదర్స్! వూరికే చందాలివ్వమంటే యివ్వరుగాని, లైబ్రరీ నిర్మాణంకోసరమని ఓ నాటకమేద్దామురా" అన్నాడు రాజాయి. "భేష్ గురూ! భలే ఐడియా" అని ఎగిరి గంతేశాడు సుబ్బాయిగాడు. అందరికీ యీ పద్ధతి కొంతవరకు నచ్చింది. కాని, "మన మొహాలు డ్రామావేస్తే కలక్షనొస్తుందట్రా" అని సందేహం వెలిబుచ్చాడు శర్మ. కొంత తర్జన భర్జనమీద, యెలా అయితేం కాన్వాస్ చేసి టిక్కెట్లు అమ్మి నాటకం ఆడితీరాలని నిర్ణయించాము. "ఏమి నాటకం అయితే బావుంద"న్న విషయం చర్చకు వచ్చింది. మా సుబ్బాయి సలహాప్రకారం ఓ యువకవి రచించిన "తానొకటి తలిస్తే" అన్న

సాంఘిక నాటకాన్ని యెన్నుకొన్నాం. నటీనటుల ఎన్నిక విషయంలో కొంత తర్జన భర్జన జరిగిన తర్వాత సుబ్బాయిగాడు హీరో, చలపాయి విలన్, వెయ్యాలని నిర్ణయించి తతిమ్మా వేషాలు అందరం సర్దుకొన్నాం. హీరోయిన్‌గా ఓ అమ్మాయికి కిరాయిచ్చి తీసుకరావటానికి నిర్ణయించాం. "అన్నీ సరేగాని, అసల్దేదిరా!" అన్నాడు రాజాయి. "అంటే?" అన్నట్లు అర్థంకాని మొహాలేసుకొని చూశాం; అందరమూ. "అల్లంరా! అంటె పైసా" అన్నాడు రాజాయి. దాంతో అందరికీ పచ్చివెలక్కాయ గొంతున పడ్డట్లయింది. మాలో యెవడిని కదిలించినా దమ్మిడీకి చెల్లడు. సుబ్బాయి కాస్త పచ్చాగా వున్నాడంటె వాడికి ఆర్థికంగా ఇంట్లో యెంతవరకు స్వాతంత్ర్యమున్నదీ అందరికీ తెలిసిన విషయమే! నాటకం ఆడాలంటే, యేబాపతన్నా గానీయి ఖర్చులు అరవై డెబ్భైదాకా అవుతాయి. ఇంతమొత్తాన్ని పెట్టుబడి పెట్టగల సమర్థుడు మాలోలేడు. "ఎలాగా!" అని అందరం తలో సిగరెట్ ముట్టించి ఘాటుగా ఆలోచించాం. చలపాయిగాడి బుర్ర అమోఘంగా పని జేసింది. సిగరెట్ గట్టిదమ్ములాగి అవతల పారేసి "అరె సుబ్బాయ్! నీచేతినివున్న వాచీ ముదరాయివ్వు." అన్నాడు. "యెందుకూ!" అన్నాడు ఖంగారుగా సుబ్బాయి. వాటిని కోమటి పున్నయ్యదగ్గర తాకట్టుపెట్టి డబ్బుతెద్దాం. వచ్చే కలక్షనులోనుండి బాకీతీర్చి తిరిగి తీసుకొందాం"అన్నాడు చలపాయి. అందరికీ నచ్చిందీ ఆలోచన. "భేష్" అన్నాం అందరమూ. "మరి మానాన్న అడిగితే..." అని నసిగాడు సుబ్బాయిగాడు. "నాన్న లేదు గీన్న లేదు. అడిగితే స్నేహితుడి కెరువిచ్చానని చెప్పు. యిలాతే" అన్నాడు తీవ్రంగా చలపాయిగాడు. ఎలాఅయితేం అందరం కలిసి అతికష్టంమ్మీద వాడిని ఒప్పించి వాడి వాచీ, రెండుంగరాలు సంస్థపరం జేసుకొన్నాం. వెంటనే నాటకనిర్వహణకు కార్యవర్గాన్ని యెన్నుకొన్నాం. రాజాయి డైరెక్టరుగా, చలపాయి కార్యదర్శిగా, సుబ్బాయి కోశాధికారిగా ఎన్నికైనారు. ఆరోజునుండే కార్యరంగంలోనికి దిగాలని నిశ్చయించుకొన్నాం.

హీరోయిన్‌ను బుక్ చేయటం, రిహార్సల్సు జరపటం, పేపర్లచ్చొత్తించటం, వగైరా కార్యక్రమమంతా చురుగ్గా సాగుతుంది. ఇహ కేన్వాసింగ్‌కు బయలుదేరాం. కేన్వాసింగ్‌తో మాకు అనుకుని విజయం లభించింది. రేపు రాత్రికి నాటక మనగా, ఈ రోజు ఉదయాని కల్లా కాన్వాసింగ్ పూర్తయింది. నాలుగు వందల యాభైవరకు కళ్ళజూచాం. నాటకం రోజు హాలువద్ద వచ్చేకలక్షను ఖర్చులకు సరిపోయినా, ఈ పైకం లైబ్రరీ నిర్మాణానికి మిగులుతుంది గదా అని సంతోషించాం. నాటకం రోజు సాయంత్రం, సుబ్బాయి ఒక పేచీపెట్టాడు. చేతికి వాచీ ఉంగరాలు లేందే స్టేజీయెక్కనని. రేపయినా తప్పేదేముందని, సభ్యులందరి అనుమతిమీద, వాడు సామాన్లు తాకట్టువిడిపించి, స్వాధీనపరచాం.

నాటకం జయప్రదంగా ముగిసింది. మా అంచనా కంటె ఎక్కువగానే, లైబ్రరీకి నాలుగువందల ఎనభైఆరుం బావలామిగిలింది. నాటకమయిన తర్వాత, అలసిపోయి అందరం, రిహార్సల్సు రూములోనే నిద్రించాం. పైకం మాత్రం మా కోశాధికారివద్దనే భద్రపరచబడింది.

మరునాడుదయం అలసటవలన యెవ్వరికీ తొమ్మిదింటివరకు మెలుకువరాలేదు. లేచి చూసేసరికి మా కోశాధికారి సుబ్బాయి మాయమయ్యాడు. ఇంటికెళ్ళాడే నన్న మా సందేహాన్ని వాడు పండుకొన్నస్థలంలోవున్న, కాగితపు మడత తీర్చివేసింది. "బ్రదర్స్! మీ అందరికీ నా ధన్యవాదాలు. నేనిన్నాళ్ళనుండో కలలుగంటున్న నా వాంఛితాన్ని దేర్చుకొనగలందులకు, ఈ ఉదయం బండిలో మెడ్రాసు వెళుతున్నాను. సినిమాఛాన్సు దొర్గ్గానే మీ కాశుభవార్తనందిస్తాను. నాప్రయాణానికి, మెడ్రాసులో నా నివాసానికి, కంపెనీ డబ్బు వినియోగించుకొంటున్నదుకు మీరంతా క్షమించాలి. మంచిరోజులు వస్తే, వడ్డీతో సహా కంపెనీ డబ్బుచెల్లిస్తాను. ఇట్లు మీ సుబ్బారావు." ఆ చీటీ చదువుకొని అందరం కొయ్యబారిపోయ్యాం.